# బోగస్ ఓట్ల తొలగింపునకు బిఎల్ఓల ఇంటింటి సర్వే ప్రారంభం



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో బోగస్ ఓటరు తొలగించడానికి ఇంటింటి సర్వేను గురువారం ప్రారంభించారు. ఈ మేరకు గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న బిఎల్ఓ లను అప్రమత్తం చేస్తూ ఇందల్వాయి తహసీల్దార్ బాలయ్య వివిధ గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సలహాలు సూచనలు అందించారు. ఈ మేరకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ఇన్ఫర్మేషన్ ఫార్ములా పంపిణీలో భాగంగా మండలంలోని చంద్రన్ పల్లీ, గన్నారం, ఎత్తుతాండా, మెగ్య నాయక్ తండా లలో విఐపి లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందని తాసిల్దార్ వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బోగస్ ఓట్లను పూర్తిగా తొలగించాలని బిఎల్ఓ లకు ఆదేశించారు. అలాగే రెండు ప్రాంతాలలో ఓటు హక్కు ఉన్న వారిని కూడా ఏదో ఒకచోట ఓటు హక్కు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట గన్నారం సర్పంచ్ సుజాత శ్రీనివాస్, చంద్రన్ పల్లి సర్పంచ్ రఘు, గన్నవరం మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బైరయ్య, డిప్యూటీ తాసిల్దార్ శైలజ ఉన్నారు.

## ఎక్సైజ్ శాఖకు ముగ్గురు అధికారుల నియామకం




నిజామాబాద్, బతుకమ్మ :నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు ఎక్సైజ్ అధికారులను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ గా శ్రీధర్ ను నియమిస్తూ గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఇంచార్జి డీసీగా వ్యవహరించిన సోమిరెడ్డిని పదోన్నతిపై ఖమ్మం డీసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ లో విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ కు పదోన్నతిపై నిజామాబాద్ కు బదిలీ చేశారు. రెండు రోజుల క్రితం ఏసీబీకి చిక్కిన నిజామాబాద్ ఈఎస్ మల్లారెడ్డి స్థానంలో నందగోపాల్ కు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల జిల్లాలో పని చేసిన నందగోపాల్ కు నిజామాబాద్ కు ట్రాన్స్ ఫర్ చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ కుమార్ ను నియమించారు. వరంగల్ డీపీఈవోగా పని చేసిన అరుణ్ కుమార్ కు పదోన్నతిపై ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారు గురువారం విధుల్లో చేరారు. జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారులు నిజామాబాద్ లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉన్నతాధికారులకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## ఉరి వేసుకుని వివాహిత మృతి



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని హన్సన్ పల్లి గ్రామానికి చెందిన వివాహిత మహిళా ఈనెల 23న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా కుటుంబీకులు గమనించి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన తాళ్ల శ్రావణి (26) చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తాళ్ల శ్రావణి మృతి చెందినట్లు ఇందల్వాయి ఎస్సై భుక్యా సుమలత తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతురాలు గత కొన్ని నెలలుగా మానసిక స్థితి కోల్పోయి అప్పుడప్పుడు భయందోళనకు గురయ్యేదని మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ వివరించారు. మృతురాలు సిరికొండ మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామానికి చెందినదని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశంలో ఉన్నాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆమె అన్నారు.

# పాత కక్షలతో దాడి

### రౌడీ షీటర్ అరెస్ట్





కామారెడ్డి, బతుకమ్మ :పాత కక్షల నేపథ్యంలో ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన రౌడీ షీటర్‌ను కామారెడ్డి టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరానికి ఉపయోగించిన తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మధుసూదన్ తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పోలీసుల వివరాల ప్రకారం, మహమ్మద్ అర్షద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో ఇంటి ప్రహరీ గోడ వివాదానికి సంబంధించిన పాత కక్షలతో నిందితుడు అబ్దుల్ సల్మాన్ ఖాన్ ఈ నెల 22న రాత్రి ఫిర్యాదుదారుడి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ఆటోరిక్షా, విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేసిన అనంతరం అర్షద్ మరియు అతని భార్యపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. అనంతరం తల్వార్‌తో బెదిరిస్తూ హత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కామారెడ్డి టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బతుకమ్మ కుంట ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తల్వార్‌తో బెదిరించి, రాయితో దాడి చేసిన విషయాన్ని నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 57 సెంటీమీటర్ల పొడవు గల తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధంగా ఆయుధాన్ని కలిగి ఉండటంతో పాటు నేరానికి ఉపయోగించినందుకు భారత ఆయుధాల చట్టం–1959లోని సెక్షన్ 35(1బి)ను కూడా కేసులో చేర్చినట్లు వెల్లడించారు. దర్యాప్తులో అబ్దుల్ సల్మాన్ ఖాన్ కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన రౌడీ షీటర్ అని, గతంలో హత్యాయత్నం సహా ఐదు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా కేసుల్లో అరెస్టై జైలుశిక్ష కూడా అనుభవించిన చరిత్ర ఉన్నట్లు తెలిపారు. నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేసిన కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌వో నరహరి, ఎస్ఐ సాయికృష్ణతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఇదే ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించినట్లు పేర్కొన్నారు.

# మెరుగైన వైద్యం ఉచితంగా అందజేసే బాధ్యత ప్రభుత్వానిదే

### సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు





నవీపేట్, బతుకమ్మ :విద్య, వైద్యం అనేది పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రైవేట్ సంస్థల్లో అందని ద్రాక్ష లా మారిందని, అందువల్ల మెరుగైన ఉచిత వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నవీపేట్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించి వైద్య సిబ్బందితో, స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న హాస్పిటల్లో సౌకర్యాలను పెంచితే మరింత మంది పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంటుందని అందుకొరకు 50 పడకల ఆసుపత్రిగా దీనిని ఏర్పాటు చేయాలని అన్నారు. అదే విధంగా సౌకర్యాలను పెంచాలని, వైద్యుల సంఖ్యను పెంచాలని, మహిళల ప్రసవాల కొరకు ప్రైవేట్ హాస్పటల్ కు జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపకుండా స్థానికంగానే ప్రసవాలను పెంచితే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుండి పాముకాటుతో, కుక్క కాటుతో వచ్చిన వాళ్లకు మెరుగైన వైద్య చికిత్స అందించడానికి రాబిన్ వ్యాక్సిన్ లతో పాటు, పాము కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని, ఆపరేషన్ సెంటర్ లను మెరుగుపరచాలని, తగినంత వైద్య సిబ్బంది ఉంటే మెరుగైన వైద్యం అందటానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, నాయకులు దేవేందర్ సింగ్, మహబూబ్, శంషు, సావిత్రి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్



భీమ్ గల్, బతుకమ్మ: రాష్ట్రంలోని పేదలందరి సొంతింటి కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్మాణం పూర్తి అయిన రాగి ఇందు కు చెందిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అట్టి ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులందరికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవ ప్రధమైన సొంత నివాసం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఇళ్లను ఆయన సందర్శించి వారితో మాట్లాడారు. లబ్దిదారుల కుటుంబాలాన్ని తమ కొత్త ఇందిరమ్మ ఇండ్లల్లో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి, జె జె నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగేంద్ర, నాయకులు కుంట రమేష్, సర్పంచ్ సమీర్, నాయకులు సుంకరి సురేష్, కత్రాజ్ శ్యాం రాజ్, వీడీసీ చైర్మన్ పతాని కృష్ణ, మూల నితీష్, నిచ్చమొల్ల మహేష్, మనోజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో ఒకరికి సంవత్సరం జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి, అక్రమంగా నిరోదించిన నేరాలలో దేవర్ల ఎల్లయ్య కు ఒక సంవత్సరం, నెల రోజుల జైలుశిక్షలు విదిస్తూ ఆర్మూర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి. శ్రీదేవి గురువారం తీర్పు చెప్పారు. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఎల్లయ్య తన ఇసుక కుప్పను గట్టు భరత్ ప్రభుత్వ అధికారులకు పట్టీచ్చినాడు అనే కోపంతో 2022, నవంబర్ 14 న రాత్రి పది గంటల సమయంలో అతని ఇంటికి వెల్లి భరత్ ఇంట్లో ఉన్నాడ అని పిలవడంతో అతని భార్య నిహారిక బయటకు వచ్చి తన భర్తకు ఆరోగ్యం బాగా లేదని చెప్పడంతో వెళ్ళిపోయాడు.

మల్లి కొంత సమయానికి ఎల్లయ్య తన భర్తకు ఫోన్ చేసి బయటకు రమ్మనగా వెళ్ళిపోయాడు. రాత్రి ఒకటిన్నర గంటలకు గ్రామస్థులు నీ భర్తను ఎల్లయ్య ఊరి బయట కట్టేతో కొడుతున్నాడని తెలపగ వెల్లి చూడగ ఎల్లయ్య తో పాటు అతని తండ్రి మారయ్య, తల్లి ఎల్లమ్మ, అతని చిన్నమ్మ సవిత, సవిత తల్లి రాములమ్మ లు భరత్ ను కట్టెతో కొట్టి గాయపరిచారని తెలిపి, ఎల్లయ్య భరత్ ను బైక్ పై తీసుకుని వచ్చి ఊరిలోనే ఒక చెట్టుకు కట్టేసి కొట్టి గాయపరచి హత్యయత్నం చేశారని మోర్తాడ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నేర విచారణ చేసిన పోలీసులు అభియోగ పత్రాన్ని కోర్టులో సమర్పించారు.

సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన కోర్టు ముద్దాయి ఎల్లయ్య పై హత్యయత్నం రుజువు కాలేదని ప్రకటించింది. కానీ భరత్ ను కిడ్నాప్ చేశాడని, అక్రమంగా నిరోదించిన నేరాలు రుజువు అయినట్లు ఆర్మూర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీదేవి నిర్ధారించారు. భారత శిక్షస్మృతీ సెక్షన్ 363 కిడ్నాప్ నేరానికి గాను ఒక సంవత్సరం కఠిన జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించారు. అక్రమంగా నిరోదించిన నేరానికి గాను ఒక నెల జైలు శిక్షతో పాటు ఐదు వందల రూపాయల జరిమానా విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని జడ్జి శ్రీదేవి తమ తీర్పులో పేర్కొన్నారు. మారయ్య, ఎల్లమ్మ, సవిత, రాములమ్మ లపై నేర ఆరోపణలు రుజువు కానందున నిర్దోషులుగా విడుదల చేశారు.

# కరీంనగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ దాడులు

ఏసీబీ అధికారులు మార్చి 17, 2026న క్రిమినల్ మిస్కండక్ట్ కేసు నమోదు చేసి, జూన్ 24న జగిత్యాల భవానీ నగర్‌లోని ఆయన అద్దె నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.20.67 లక్షల నగదు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలో రూ.29.88 లక్షలు, ఆయన తండ్రి యూనియన్ బ్యాంక్ ఖాతాలో రూ.16.77 లక్షల బ్యాంకు నిల్వలు, రూ.11.97 లక్షల విలువైన ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

అదనంగా కరీంనగర్ పట్టణంలో రూ.6.05 లక్షల విలువైన ఓపెన్ ప్లాట్, సిరిసిల్లలో రూ.2.18 లక్షల విలువైన వాణిజ్య స్థలాన్ని గుర్తించారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.87.44 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. అయితే, ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.

తన అధికార పదవిని దుర్వినియోగం చేసి అక్రమ మార్గాల్లో ఈ చరాస్తులు, స్థిరాస్తులు సంపాదించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయని, కేసుపై మరింత దర్యాప్తు జరుగుతోందని ఏసీబీ వెల్లడించింది.